
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పక్కాగా హాజరు..

- ఉపాధ్యాయులకు ఫేషియల్ రికగ్నిషన్
- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- త్వరలోనే అమలు



జగిత్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమయపాలనపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. టీచర్ల హాజరు కోసం ఫేషియల్ రికగ్నిషన్ ప్రవేశపెట్టనుంది. చాలామంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందడం లేదని, ప్రాథమిక పాఠశాలల్లో కొంత మంది విధులకు హాజరు కాకపోయినా మరుసటి రోజు రిజిస్టర్‌లో సంతకాలు పెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పాటు పాఠశాలల పనివేళలకు ముందుగానే ఇంటిముఖం పట్టడం, వివిధ వ్యాపారాలు, ఇతర వ్యాపకాలలో నిమగ్న మవుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కొవిడ్‌కు ముందు సర్కారు పాఠశాలల్లో బయోమెట్రిక్ అమలు చేశారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరయ్యారు. ఆ తర్వాత అవి మూలన పడడంతో పరిస్థితి మళ్లీ మొద టికి వచ్చింది. ఈ క్రమంలో టీచర్లకు ఫెషియల్ రికగ్నిషన్ హాజరు అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేశారు. సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు అమలవుతున్న విషయం తెలిసిందే. టీచర్లకు కూడా అమలు చేస్తే సక్రమంగా విధులకు హాజరయ్యే అవకాశం ఉంటుందనే అభిప్రాయం ఉంది.

జిల్లా వ్యాప్తంగా 824 ప్రభుత్వ పాఠశాలలు

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 824 వివిధ ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 516 ప్రాథమిక పాఠశాలలు, 88 ప్రాథమికోన్నత పాఠశాలలు, 220 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో సుమారు 57,552మంది విద్యార్థులు ప్రవేశాలుపొంది విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3,750మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలోని పాఠశాలల్లో 1,427 మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు, హెల్పర్లు పని చేస్తున్నారు. మండల పరిషత్, జిల్లాపరిషత్, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, మినిగురుకులాలు, మైనార్టీసంక్షేమ, మహాత్మ జ్యోతిరావు పులే, టీఎస్ మోడల్, టీఎస్ఆర్ఈఐ సొసైటీ పాఠశాలల్లో చదువు కుంటున్న విద్యార్థుల హాజరును గత విద్యా సంవత్సరంలో ఫేసియల్ రిక గ్రేషన్ సిస్టం ద్వారా నమోదు చేశారు. ఈ విధానం విద్యార్థుల హాజరు నమోదు విజయవంతం కావడంతో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుల హాజరుసైతం ఇదే విధానంలో నిర్వహించడానికి విద్యాశాఖ యోచిస్తోంది.

మూలనపడ్డ బయోమెట్రిక్

ఉపాధ్యాయుల సమయపాలనకోసం 2018 సంవత్సరంలో ప్రభుత్వం బయోమెట్రిక్ తీసుకొచ్చింది. చాలామంది టీచర్లు వాటిని సరిగా వినియోగించలేదనే ఆరోపణలు వచ్చాయి. నెట్‌వర్క్ సమస్య, యంత్రాల మరమ్మతులు తదితర కారణాలు చూపుతూ హాజరు వేయకుండానే కొందరు తప్పించుకున్నారు. ఇది విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం చూపింది. సర్కారు బడుల్లో చదివే సగం మంది విద్యార్థులకు చదవడం, రాయడం రావడం లేదని సర్వేల్లో వెల్లడైంది. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతోనే దుస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. కరోనా తగ్గుముఖం పట్టిన తర్వాత యంత్రాలను పునఃప్రారంభించాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొన్ని నెలలు మాత్రమే వాటిని ఉపయోగించి మూలన పడేశారు. ఈ యంత్రాలు పనిచేసిన సమయంలో సమయపాలన పాటించేందుకు పరుగులు తీసిన టీచర్లు, ప్రస్తుతం బయోమెట్రిక్ భయం లేకపోవడంతో ఎప్పుడైనా వెళ్లొచ్చన్న విధంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు పర్యవేక్షణను పూర్తిగా గాలికి వదిలేశారు.

సొంత పనుల్లో నిమగ్నం

జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించడం కంటే వారి సొంత పనుల్లోనే నిమగ్నమవులున్నారనే...

మిగతా 8లో..

కారోబార్లు, బిల్‌కలెక్టర్ల జిల్లా కార్యవర్గం



ఎన్నికైన కారోబార్, బిల్‌కలెక్టర్ల కార్యవర్గం

జగిత్యాలరూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కారోబార్లు, బిల్ కలెక్టర్ల నూతన జేఏసీ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా గంగమల్లు, గౌరవ అధ్యక్షుడిగా కిరణ్, వైస్ చైర్మన్‌గా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా వేముల భరణి, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, రమేష్, పాషా, గంగాధర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా మారుతి



కార్యవర్గానికి నియామకపత్రాలు అందిస్తున్న ఎన్నికల నిర్వాహకులు

జగిత్యాల అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాయికల్ పట్టణానికి చెందిన మూగల మారుతి ఎన్నికయ్యారు. జిల్లా స్వర్ణకార సంఘం ఎన్నికలు ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా శ్రీపాద సంతోష్ కుమార్‌లు గెలుపొందారు. ఈసందర్భంగా మారుతి మాట్లాడుతూ జిల్లా స్వర్ణకారుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

మల్యాల, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం మల్యాలలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ధర్మ జాగరణ ప్రముఖ్ వేముల రామ్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ జీవనానికి హిందూ సంస్కృతి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాక అంజయ్య పాల్గొన్నారు.

●కొడిమ్యాల: మండల కేంద్రంలోని విజ్‌డమ్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వయం సేవకులు గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వచ్చిన ఆర్ఎస్ఎస్ జిల్లా సహ కార్యవాహ గుండు సాయిమధుకర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు ప్రభాకర్‌రెడ్డి, మల్యాల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఆర్.ఎస్.ఎస్. ఉప మండల ప్రముఖ్ మంచాల శ్రీనివాస్, పలువురు స్వయం సేవకులు పాల్గొన్నారు.

వరుణుడి కోసం ఎదురుచూపులు

- ఊరించి ఊసురుమనిపించిన వర్షాలు ●ముదిరిపోతున్న వరినార్లు



భూషణరావుపేటలో ముదిరిన నారు

కథలాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. వాన జాడ లేక ఆకాశం వంక చూస్తూ అల్లాడుతున్నారు. జూన్ మొదటి వారంలో వానలు మురిపిం చడంతో రైతులు ఎంతో సంబర పడిపోయి నార్లు పోసుకున్నారు. మొక్కజొన్న, పసుపు, కంది వంటి పంటలు కూడా వేసుకున్నారు. నార్లు పోసి నెల రోజులు దాటిపోవడంతో ముదిరిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూలై మొదటి వారంలోనైనా వర్షాలు కురుస్తాయని ఆశపడ్డ రైతులకు నిరాశే ఎదురైంది. ఈ నేపథ్యంలో పలు గ్రామాల్లో వాన దేవతలకు జలాభిషేకాలు చేశారు. వానమ్మా..రావమ్మా అంటూ రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

● ఆందోళనలో రైతులు

మండలంలో ఏటా వానాకాలం సీజన్‌లో 21 వేల ఎకరాల్లో వరి పంటలు సాగు చేస్తుంటారని వ్యవసాయ అధికారుల అంచనా. జూలై మాసం రెండో వారం వరకు దాదాపు 80 శాతం వరకు నాట్లు పూర్తయ్యేవి. కానీ ఇప్పటికీ కనీసం 20 శాతం కూడా నాట్లు పడకపోవడం పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 7 వేల ఎకరాల్లో మొక్కజొన్న, మూడు వేల ఎకరాల్లో పసుపు పంటలు రైతులు వేసుకున్నారు. ఆ పంటల పరిస్థితి కూడా అగమ్యగోచరంగా పరిణ మించింది. బోర్లపై ఆధారపడి సాగు చేసుకున్న రైతులకు కొంత ఇబ్బంది లేకున్నా బావులు, చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల మీద ఆధార పడి సాగు చేసుకునే రైతులు వానకోసం దీనంగా ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. నారు పోసిన నెల రోజుల వ్యవధిలోనే నాట్లు వేసుకుంటే వాతావరణం అను కూలించి దిగుబడులు అధికంగా రావడానికి ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం నారు పోసి నెల దాటినా వానలు కురవక సాగు చేసుకోలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బావుల్లో ఉన్న కొద్ది పాటి నీటితో పొలాలు సిద్ధం చేసుకున్నా ఎండల కారణంగా దుక్కులు ఎండిపోతున్నాయి. వర్షం కురిస్తేనే రైతులు సాగు చేసుకునే పరిస్థితి నెలకొంది.

'స్థానిక ఎన్నికల్లో ఎంఐఎం సత్తా చాటాలి'



ఎంఐఎంలో చేరిన యువకులతో నాయకులు

మెట్‌పల్లి టౌన్, జూలై13 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంఐఎం సత్తా చాటాలని ఉమ్మడి జిల్లా ఎంఐఎం పార్టీఇన్‌చార్జి సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్‌పై ఆకుపచ్చ జెండా ఎగరడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఆదివారం ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించిన కార్యక్రమానికి సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ హాజరయ్యారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఓఫంక్షన్‌హాల్‌లో ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ అఖీల్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. గులాం అహ్మద్ హుస్సేన్ పార్టీలో చేరిన యువకులకు, పెద్దలకు ఎంఐఎం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో మెట్‌పల్లి, రామగుండం, పెద్దపల్లి, జగిత్యాల, గోదావరిఖని, సిరిసిల్ల, హుజురాబాద్, కరీంనగర్ మున్సిపల్ కౌన్సిల్‌ల పరిధిలో ఎంఐఎం పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం జగిత్యాల అధ్యక్షుడు యునూస్ నదీమ్, కోరుట్ల అధ్యక్షుడు అబ్దుల్ రఫీ, మాజీ కౌన్సిలర్ రజియుద్దీన్, నాయకులు వాజిద్, హఫీజ్ ఖురేషీ, రహీం, సురేష్, కరీం, మెట్‌పల్లి నాయకులు పాల్గొన్నారు.



పచ్చి రొట్టతో భూసారం పెంపు

- చీడపీడల నియంత్రణ
- అధిక దిగుబడి సాధించేందుకు అనుకూలం

8

వైభవంగా పోచమ్మ బోనాలు

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

ఘనంగా గోరింటాకు వేడుకలు



ధర్మపురిలో గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న మహిళలు

జగిత్యాల క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్‌లో ఆదివారం కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కవయిత్రిల గోరింటాకు ముచ్చట్లు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మహిళలతో పాటు కవయిత్రిలు తమ కవితలు వినిపించారు. అనంతరం చేతులకు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, కవయిత్రిలు అయిత అనిత, లక్కరాజు శ్రీలక్ష్మి, ములస్తం లావణ్య, రుద్రంగా రమాదేవి, సవిత, లక్ష్మి, రేఖ, శోభ, ప్రభాకర్, రాణి, శ్యామల, ఉమారాణి తదితరులు ఉన్నారు.

●ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని హనుమాన్‌వీధిలో ధనలక్ష్మి కిట్టీ పార్టీ ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాసం పురస్కరించుకొని మహిళలు చేతులకు గోరింటాకు పెట్టు కున్నారు. మహిళలు అందరూ సామూహికంగా ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఇనుగంటి నిర్మల, రమాదేవి, బలుమూరి సరళ, భీమనాతి మంగ, బెజ్జంకి శ్రీలత, కొండపెల్లి నాగరాణి, సోమిశెట్టి స్వాతి, గాదె కవిత, నీరజ, రాధిక, శైలజ, అంకిత, ప్రతిభ, రమ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోపూజ



స్వామి వారి పల్లకి మోస్తున్న భక్తులు

కొడిమ్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పల్లకి సేవ, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు ఆలయ పూజారి నాగరాజు రమేష్ నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేశం, సభ్యులు, దాతలు, గ్రామ ప్రముఖులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మల్లాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం మెట్‌పల్లికి చెందిన ఓ ప్రైవేట్ ఆసుపత్రి వారు నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహించి పిల్లలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వాతావరణంలో జరుగుతున్న మార్పులతో అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. వైద్య పరీలక్షలు చేసిన డాక్టర్లకు కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లాల జలపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, అయ్యోరి దశరథం, గంగరాజం, పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం శరత్, కోటగిరి ఆనంద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

●భీమారం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందారం గ్రామంలో భారతి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వైద్యులు రాచకొండనాగరత్న, రాచకొండ శ్రీనివాస్‌లు 150మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పుల్లూరి ఉమారాణి-దేవయ్య, బింగి స్వామి, ప్యాట వెంకటేశం, బాసోజి శోభన్, కుంట సురేష్, పీఎంపీ వైద్యులు తిరుపతి, అజీమ్, కాంత య్య, రమేష్, సురేందర్, మల్లేశం, లక్ష్మీనారాయణ, బాలుసాని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి'



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి భార్గవరామ్

గొల్లపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఎంపీలు పార్లమెంట్ ఉభయ సభల్లో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఓరగంటి భార్గవరామ్ బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గొల్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలను రాజకీయంగా చైతన్యపర్చిన ఘనత ఏపీ మాజీ సీఎం స్వర్గీయ నందమూరి తారకరామా రావుకే దక్కుతుందన్నారు. ఆయన ప్రత్యేక చొరవతోనే నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాల్లో బీసీల ప్రాతినిధ్యం పెరిగిందన్నారు. ఎట్టకేలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ సీఎం రేవంత్ రెడ్డి సాహోసపేత నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ శుభ పరిణామమని కొనియాడారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్లను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొంటూ సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ సమాజం పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. పదేళ్ల పాలన కాలంలో బీసీ సమాజానికి గొర్రెలు, బర్రెలు తప్ప రాజకీయంగా, ఉద్యోగ పరంగా ఎలాంటి అవకాశాలు కల్పించని గత బీఆర్ఎస్ పాలకులు బీసీల అభివృద్ధి పట్ల కపట ప్రేమ నటిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీలు ఎనిమిది మంది పీఎం నరేంద్ర మోదీ పై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్ ఉభయ సభల్లో 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని ఈ సందర్భంగా బీజేపీ ఎంపీలను కోరారు. రాబోయే 2029 ఎన్నికల్లో రాష్ట్రంలో బీసీ సీఎం అయ్యేలా అన్ని రాజకీయ పార్టీలు బీసీల రిజర్వేషన్లకై పోరాడాలని ఓరగంటి భార్గవరామ్ కోరారు. బీసీల అస్థిత్వ పోరాటంలో సహకరించని ఏ రాజకీయ పార్టీకైనా రాబోయే రోజుల్లో పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ ఓరగంటి పెద్దిరాజ్, సంఘం మండల శాఖ అధ్యక్షుడు బొంగుడపు తిరుపతి, నాయకులు కాళ్ల రాజయ్య, ఎలవేణి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'తీన్మార్ మల్లన్న క్షమాపణ చెప్పాలి'



సీఐకి ఫిర్యాదు చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) :జాగృతి నాయకురాలు కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్న తక్షణమే క్షమాపణ చెప్పాలని జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. కవితపై చింతపండు నవీన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జగిత్యాలలో ఆదివారం జాగృతి, బీఆర్ఎస్ నాయకురాళ్లతో కలిసి వసంత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్ నవీన్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ టౌన్ సీఐ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజాస్వామ్య పదవిలో ఉండి నవీన్ నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితో ఊరుకోమని హెచ్చరించారు. బీసీల కోసం పోరాడుతున్న కవితపై వ్యాఖ్యలు చేసిన నవీన్‌ను బీసీ సమాజం క్షమించదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్లు రాణి, ఉదయశ్రీ, నాయకురాళ్లు అనురాధ, లక్ష్మి, రజియా, నజీమ, భాగ్యలక్ష్మి, సునీత తదితరులు ఉన్నారు.

మడేలేశ్వరస్వామికి పూజలు

మల్లాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గ్రామంలోని భక్తులు స్వామిని ఉదయం నుంచి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో భక్తులు బోనాలను నెత్తిన ఎత్తుకొని డప్పుల చప్పుల మధ్య ఆలయానికి బయలు దేరారు. బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్నలతో పాటు నాయకులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

గంభీరావుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బండారి బాలమల్లుపై బండరాయితో దాడిచేసి, గాయపర్చిన సంఘటనలో అదేగ్రామానికి చెందిన నర్ర మల్లేశం, నర్ర అజయ్, నర్ర యాదవ్వలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు. బాలమల్లు 35ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వ్యవసాయపొలంలోకి ఈ నెల 12న నర్ర మల్లేశం, అతని కొడుకు అజయ్, భార్య యాదవ్వలు వచ్చి తమ పొలం అంటూ దూషిస్తూ దాడి చేశారని ఎస్‌ఐ తెలిపారు. బాలమల్లును నెట్టివేస్తూ ముగ్గురు బండరాయితో దాడిచేయగా తలకు, కుడిచేతికి గాయమైందన్నారు. దాడి సమయంలో అడ్డువెళ్లినబాలమల్లు తండ్రికి, అన్నకుకూడా గాయాలైనట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నర్ర మల్లేశం, అజయ్, యాదవ్వలపై కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఒకరిపై కేసు

మల్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నూకపల్లి డబుల్‌బెడ్‌రూం కాలనీలో ఒకరిపై దాడిచేసిన షేక్ హంజ అలియాస్ అయాన్ అనేవ్యక్తిపై కేసునమోదు చేసినట్టు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. షేక్ రహీన్‌ను పాతగొడవల నేపథ్యంలో శని వారం రాత్రి అదేకాలనీకి చెందిన షేక్ హంజ అలియాస్ అయాన్ తనమిత్రులతో కలిసి దాడిచేయగా గాయాలు అయినట్లు ఎస్సై తెలిపారు. దీంతో రహీన్‌భార్య రజియాబేగం ఫిర్యాదుమేరకు షేక్ హంజ అలియాస్ అయాన్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

పరిషత్ ఎన్నికలపై దృష్టి

- ప్రణాళిక రూపొందిస్తున్న కాంగ్రెస్
- 16న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ రాక
- ఇందిరా గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా సమావేశం
- డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలకు ఆహ్వానం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మూడు నెలల్లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపడం అనివార్యం కావడంతో కాంగ్రెస్ పార్టీ ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నది. స్థానిక సంస్థల్లో పట్టు సాధించడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులను పెంచుకుని వారి ద్వారా అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి ఘన విజయం సాధించాలని ఆ పార్టీ భావిస్తున్నది. గ్రామీణ స్థాయిలో సంస్థాగత నిర్మాణం, స్థానిక సంస్థల్లో ప్రతి నిధులను గెలిపించుకోవడం లక్ష్యంగా ఆ పార్టీ అధిష్ఠానం వ్యూహరచనలు చేస్తున్నది.

● కమిటీల నియామకానికి చర్యలు

ఇటీవల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉమ్మడి జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జిలను నియమించింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలుగా, వారితో కలిసి పనిచేసేందుకు ఇద్దరు, ముగ్గురు చొప్పున ప్రతినిధులుగా పార్టీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను ప్రకటించింది. స్థానికంగా ఉండే డీసీసీ అధ్యక్షులతో కలిసి పార్టీ నేతలు సంస్థాగతంగా అన్ని కమిటీల నియామకానికి చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని పటిష్ఠం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నేతలను గెలిపించడానికి కార్యాచరణ రూపొందించనున్నారు. ఇందులో భాగంగానే ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌చార్జిగా నియమితులైన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయమైన ఇందిరాభవన్‌లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో ఈ నెల 16న సమావేశం నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆయన ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లను కలిసి జిల్లాలో సంస్థాగత పరిస్థితులపై చర్చించారు. 16న ఉమ్మడి జిల్లా పరిధిలోని డీసీసీ అధ్యక్షులతో కలిసి ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ సభ్యులు, ఆయా స్థానాలకు పోటీ చేసి ఓడిపోయి ఇన్‌చార్జిలుగా ఉన్న నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పీసీసీ, డీసీసీ కార్యవర్గ సభ్యులు, ఇతర నాయకులకు ఈ సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానాలు పంపించారు. సమావేశంలో ప్రస్తుతం జిల్లాల్లో పార్టీ పరిస్థితిపై చర్చిస్తారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను గెల్చుకున్నాం, ఇప్పుడు మెజార్టీ స్థానాలను గెలుపొందడానికి ఏం చేయాలి అనే విషయాలపై వారు చర్చించనున్నారని సమాచారం.

● బీసీ రిజర్వేషన్లే ప్రధాన ప్రచార అస్త్రం

ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని ప్రధాన ప్రచార అస్త్రంగా మల్చుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలైన రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ అంశాలను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలనుకుంటున్నారు. నియోజకవర్గానికి 3500 చొప్పున నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రజల్లో ప్రచారంచేసి త్వరలోనే రెండో విడత ఇళ్ల మంజూరు జరుగుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని భావిస్తున్నారు. ఈ అంశాలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయమేమిటి, మరింత సానుకూలత పెంచడానికి ఏ చర్యలు చేపట్టాలి, వాటిని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి ఏ రకంగా వ్యూహం రూపొందించాలి అన్న విషయమై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి 18 నెలలు కాగా ప్రజల్లో ప్రభుత్వంపట్ల అసంతృప్తి పెరిగిపోయిందని ప్రచారం జరుగుతోంది. దానిని తిప్పికొట్టాలని, ఒకవేళ ఎక్కడైనా అసంతృప్తి ఉంటే కారణాలు తెలుసుకుని సరిచేయాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ ముందుగానేస్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరు ఇతర పార్టీల్లోనూ చర్చనీయాంశమైంది.

ఓసీపీ-3లో ప్రమాదం



ప్రమాదంలో గాయపడ్డ శ్రావణ్

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2ఏరియాలోని ఓసీపీ-3 ప్రాజెక్టులో ఆదివారం జరిగిన ప్రమాదంలో గొల్ల శ్రావణ్ అనేకార్మికుడు గాయపడ్డాడు. ప్రైక లు మెయిలలియాన్ డీజిల్‌బౌజర్ మరమ్మతు సమయంలో ప్రమాదం జరిగింది. మిడిల్ షిఫ్టులో జనరల్ మజ్దూర్ అయిన శ్రావణ్ డీజిల్ బౌజర్ టైర్ల కింది భాగంలో ఎయిర్‌కనక్షన్ సరిచేస్తుండగా బౌజర్ ముందుకు కదిలింది. వాహనం శ్రావణ్ మీద నుంచి కదలడంతో తలకు, పక్కటెముకలకు గాయాలయ్యాయి. అధికారులు హుటాహుటిన శ్రావణ్‌ను స్థానికడిస్పెన్సరీకి తరలించి ప్రథమచికిత్స అనంతరం గోదావరిఖని ఏరియాఆసుపత్రికి తరలించారు. టీబీజీకేఎస్ నాయకులు డిస్పెన్సరీలో శ్రావణ్‌ను పరామర్శించారు. ఇటీవల ఓసీపీ-3లో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు రక్షణపై దృష్టి సారించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్జీ-2బ్రాంచ్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ప్రమాదవశాత్తు కిందపడి జీపీ ఉద్యోగి మృతి



సమ్మయ్య(ఫైల్)

కల్వశ్రీరాంపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బల్బు పెట్టేందుకు ప్రయత్నించి గ్రామపంచాయతీ ఉద్యోగిమృతి చెందిన సంఘటన మండలంలోని తారుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపినవివరాల మేరకు ఆవిడాలసమ్మయ్య(54) గ్రామపంచాయతీలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం అంగడి కావడంతో అక్కడే ఉన్న హనుమాన్ గుడివద్దన ఉన్న కరెంటు పోలుకు విద్యుత్ బల్బుపెట్టేందుకు ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు జారిపడటంతో సమ్మయ్య తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సారమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన ఎండి జరీన్ అనేవ్యక్తి డబుల్‌బెడ్‌రూం ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబసభ్యులు, స్థానికులు అడ్డుకున్నారు. శనివారం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసిన జాబితాలో తన పేరు లేదని ఆవేదన చెంది ఆదివారం గ్రామశివారులో పురుగుల మందు డబ్బాను చూపిస్తూ ఆత్మహత్య చేసుకుంటున్నానని మిత్రులకు వీడియో కాల్ చేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు, మిత్రులు అక్కడికి చేరుకుని బుజ్జగించి ఆత్మహత్యాయత్నాన్ని విరమింపజేశారు. ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి కాంగ్రెస్ కార్యకర్త కావడంతో ఈ విషయం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మెటపల్లిటౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెజ్జారపు నిఖిల్ (26) అనే యువకుడు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా నిఖిల్ అనే వ్యక్తి ఎగిరి పడి అటుగా వస్తున్న ట్రాక్టర్ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనదారుడికి గాయాలు కాగా స్థానికులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ అపఘాయం ఆతికేగంగా వెళ్లి పోయాడని స్థానికులు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పొన్నం రవిచంద్రకు హైమా అవార్డు

కరీంనగర్ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌కు చెందిన ఫిలిం క్రిటిక్ కవిసో అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర హైమా అవార్డు అందుకున్నారు. ఆదివారం రాత్రి భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు రామకృష్ణగౌడ్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.



హైమా అవార్డు అందుకుంటున్న పొన్నం రవిచంద్ర

మట్టి, ఇసుకను అక్రమంగా

రవాణా చేస్తే కఠిన చర్యలు

- మట్టి తరలిస్తున్న 10 వాహనాలు సీజ్
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి, ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వేములవాడ రూరల్ మండలం కొడుముంజ, అనుపురం గ్రామ పరిసరాల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న 10మట్టి తవ్వేయంత్రాలు, మట్టి తరలించే వాహనాలను ఆర్డీవో రాధాబాయి సీజ్ చేశారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు తరలిస్తున్నట్లు బ్యానర్‌తో అక్రమంగా తరలిస్తున్న 4 టిప్పర్లు, 2 ట్రాక్టర్లు, 2 జేసీబీలు, 2 హిటాచి యంత్రాలను సీజ్‌చేసి వారిపై కేసులు నమోదుచేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతులు తేకుండా మట్టి, ఇసుక రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

శ్రావణ్ ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కదారి శ్రావణ్‌కుమార్ ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. కరీంనగర్ మహిళా రాజా సీవెలోపాటు శ్రావణ్‌కుమార్ భార్య తరఫున బంధువుల వేధింపులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ ఆదివారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గది ఎదుట ఆందోళన చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకునేవరకు పోస్టుమార్టం నిర్వహించ వద్దని భీష్మించారు. శ్రావణ్‌కుమార్ సోదరి వనజ మీడియాతో మాట్లాడుతూ శ్రావణ్‌కుమార్‌పై ఆతడి భార్య నీలిమ వరకట్నం వేధింపుల కేసు పెట్టించింది, ఈ క్రమంలో శ్రావణ్‌కుమార్‌ను కరీంనగర్ మహిళా రాజా సీవ బెదిరించారని ఆరోపించారు. దీంతో ఈనెల10న పురుగుల మందుతాగాడని, ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. శ్రావణ్ కుమార్ తండ్రి ఫిర్యాదుతో చొప్పదండి పోలీసులు కేసు నమోదు చేశారు.

● భార్యాభర్తల వివాదం

విడాకుల కోసం మ్యూచ్‌వల్‌గా సంతకాలు పెట్టి అంగీకరించిన తరువాత తనపై అక్రమంగా వరకట్నం వేధింపుల కేసు నమోదు చేయడమేమిటని శ్రావణ్‌కుమార్ ఆత్మహత్యకు ముందు ఒక సెల్ఫీవీడియోలో ఆరోపించాడు. తన చావుకు నీలిమ, తన భార్య నీలిమతోపాటు ఆమె బంధువులు ప్రవీణ్, నవీన్, ప్రసన్నవినోద్, మధు కారణమని పేర్కొన్నాడు.



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విలపిస్తున్న శ్రావణ్ కుటుంబ సభ్యులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం పరిధిలో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్ రెడ్డిప్రకటనలో తెలిపారు. రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన గజ్జెలరమేష్‌పై కేసునమోదు చేసినట్లుపేర్కొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుకతరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ ఆదివారం తెలిపారు. జమ్మికుంట మండలంలోని వావిలాల మానేరుపరివాహక ప్రాంతంనుంచి ఎలాంటి అనుమతులులేకుండా తరలిస్తున్న ఇసుకట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ పేర్కొన్నారు.

మేడిపల్లిలో కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య



మల్లికార్జున్‌గౌడ్(ఫైల్)

జ్యోతినగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేడిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి సింగం మల్లికార్జున్‌గౌడ్(40) అనే ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన స్థలానికి ఎన్టీపీసీ పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఇసుక క్వారీ వద్ద లారీ డ్రైవర్ల ఘర్షణ

మంథని రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మంథని మండలంలోని ఆడవి సోమనపల్లి గ్రామంలో గల ఇసుక క్వారీ వద్ద లారీడ్రైవర్ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆదివారం స్థానిక, నాన్‌లోకల్ డ్రైవర్ల మధ్య వివాదం నెలకొంది. స్థానికులకు మొదట ప్రాధాన్యమిచ్చి లారీలను లోడ్ చేయాలని డిమాండ్‌చేశారు. ఆదేవిధంగా నాన్ లోకల్ సైతం లోడింగ్ చేయాలని ఆందోళన చేయడంతో ఇరుపక్షాల మధ్య వాదనలు పెరిగి ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. లారీడ్రైవర్లు లారీలు నిలిపి ధర్నా నిర్వహించారు. మంథనిఎస్‌ఐ రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని ఇరుపక్షాలను శాంతింపచేశారు. నిర్వాహకులు ప్రస్తుతానికి ఇసుక క్వారీని తాత్కాలికంగా మూసివేశారు.

విద్యుత్ వైరు తగిలి గేదె మృతి

గన్నేరువరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారువెల్ల గ్రామంలో ప్రమాదవశాత్తు ఆదివారం విద్యుత్ ఎల్టీ లైన్ వైరు తెగిపడి ఓ గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు మారశాలి కిష్టయ్యకు చెందిన గేదె వాగు సమీపంలోని వ్యవసాయభూమిలో మేత మేస్తుండగా అకస్మాత్తుగా ఎల్టీ లైన్ వైరు తెగిపడి పడడంతో మృతి చెందిందన్నారు. గేదె విలువ సుమారు 60వేలు ఉంటుందని విద్యుత్ అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరాడు.

నారుమడిని కాపాడుకోవడానికి..

- బిందెలతో నీళ్లు పడుతున్న రైతులు
- మూడు రోజుల క్రితం కాలిన ట్రాన్స్‌ఫార్మర్
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

గొల్లపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం రంగధాముపల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో నారుమడులకు నీరందడం లేదు. అటు వర్షాలు కురవక, ఇటు విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంతో నారుమడులను కాపాడుకునేందుకు పలువురు రైతులు బిందెలతో నారు మడులకు నీళ్లు పోస్తూ నానాపాట్లు పడుతున్నారు. స్థానిక గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ మూడురోజుల క్రితం కాలిపోయింది. దీనిపై స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారం అందించినా మరమ్మతులు చేపట్టలేదు. సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్‌ద్వారా 25మంది రైతులు వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించాలని బాధితరైతులు కోరుతున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ మధును వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.



రంగధాముపల్లిలో బిందెలతో నారు మడికి నీరు పోస్తున్న మహిళా రైతులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొడిమ్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని చెప్యాల క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెప్యాల గ్రామానికి చెందిన ఊటుకూరి అభిషేక్ అనే యువకుడు గాయాల పాలైనట్లు ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. అభిషేక్ చెప్యాల గ్రామం వైపు నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా ఎదురెదురుగా ద్విచక్ర వాహనం కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

కల్వశ్రీరాంపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టు పైనుంచిపడి గీత కార్మికునికి గాయాలయ్యాయి. మండలంలోని పెగడపల్లి గ్రామానికిచెందిన గోపగాని రాజమల్లు ఆదివారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆతని కాళ్లు, చేతులు, తలకు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యంకోసం పెద్దపల్లికి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

ఎల్లారెడ్డిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటగ్రామ శివారులోని వట్టవాగుకుంట సమీపంలో నుంచి మట్టిని తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ ఆదివారం కట్టపై నుంచి అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి కిందకు దూకేశాడు. దాంతో ప్రమాదం త్రుటిలో తప్పినట్లయింది. మట్టిని తరలిస్తున్న సమయంలో అదుపు తప్పి కట్టపై నుంచి ట్రాక్టర్ట్రాలీ బోల్తాకొట్టింది. సమాచారం అందుకున్న రైతులు ఎక్స్‌కవేటర్‌తో బోల్తాపడిన ట్రాక్టర్‌ను తొలగించారు.

నట్టల నివారణ మందులేవి?

● రెండేళ్లుగా పంపిణీ చేయని ప్రభుత్వం



కరీంనగర్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గొర్రెలకు, మేకలకు ఏడాదికి నాలుగు సార్లు నట్టల నివారణ మందును తాగించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి రెండు సార్లు నట్టల నివారణ మందులను పంపిణీ చేసేది. ఇప్పటికి రెండేళ్లుగా పంపిణీ చేయకపోవడంతో గొర్రెల, మేకల పెంపకం దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో ప్రైవేటు దుకాణాల నుంచి ఆర్థిక భారమైనా కొనుగోలు చేస్తున్నారు. ఆలస్యంగానైనా ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు గొర్రెల కాపరులు తీసుకుంటున్నారు. రెండేళ్లుగా గొర్రెలు, మేకలకు ప్రభుత్వం నట్టల నివారణ మందుల సరఫరా చేయడం లేదు. సకాలంలో నట్టల నివారణ మందులు తాగించడం వల్ల జీవాలు ఆరోగ్యవంతంగా ఉంటాయని, బరువు పెరుగుతాయని పశువైద్యులు చెబుతున్నారు. బరువు పెరిగిన గొర్రెలు, మేకలను విక్రయిస్తే పెంపకం దారులకు లాభదాయకంగా ఉంటుంది. కరీంనగర్ రూరల్ మండలంలో మొత్తం 4,500 వరకు మేకలు, 35 వేల వరకు గొర్రెలు ఉన్నాయి. గతంలో ప్రతి యేడు రెండు సార్లు ప్రభుత్వమే నట్టల నివారణ మందులను పశు వైద్యశాల ద్వారా అందించేది. రెండేళ్లుగా నిలిచిపోయింది. దీంతో గొర్రెలు సరిగా పెరగక, విక్రయాలు సగానికి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేయకపోవడంతో సొంత డబ్బుతో నట్టల నివారణ మందులు వేయిస్తున్నామని మరికొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈనెలలో పశువులకు రోగాల బారిన పడకుండా మాత్రం టీకాలు వేశామని పశు వైద్యాధికారులు తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకుని నట్టల నివారణ మందులు పంపిణీచేయాలని గొర్రెల పెంపకందారులు కోరుతున్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ

నిమ్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా, నాగారం ధర్మపురికి చెందిన అరుణ్ కుమార్ (61) తలకు సర్జరీ కోసం జూన్19న నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. అప్పటినుంచి చికిత్స పొందుతున్న అరుణ్ కుమార్ ఆదివారం మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని సందర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తొందరగా మృతదేహాన్ని వారి సొంతూరుకు పంపాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్, అడిషనల్‌డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ ఉన్నారు.

తండ్రీకొడుకుల మధ్య భూవివాదం

● పురుగుల మందు తాగి కొడుకు మృతి

జూలపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండలకేంద్రానికి చెందిన గుమ్మడి సతీష్(35) ఆనివృత్తి భూమి వివాదంలో తీవ్ర మనస్తాపానికి లోనై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గుమ్మడి మల్లయ్యకు ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.అందరికీ వివాహాలయ్యాయి. మల్లయ్యకు 30గుంటల వ్యవసాయ భూమి ఉంది. భూమిపంపకం విషయంలో తండ్రి మల్లయ్య, కొడుకు సతీష్ మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో శనివారం తండ్రికొడుకు మధ్య గొడవ జరుగగా మనస్తాపానికి గురైనసతీష్ పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగాచికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. సతీష్‌కు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడిభార్య ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సనత్‌కుమార్ పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలో వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులు ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయా క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతి, రాజరాజేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

రాజన్న సేవలో పరకాల ఎమ్మెల్యే..


వేములవాడ రాజరాజేశ్వర స్వామిని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకలు స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయాధికారులు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

వన మహోత్సవంలో మొక్కలు నాటిన ఈవో..

దేవదాయ ధర్మదాయశాఖ ఆదేశాలతో వేములవాడ మున్సిపల్ పరిధిలోని గురువయ్యనగర్ సమీపంలో ఆలయఈవో రాధాబాయి వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి సబంధించిన స్థలంలో ఆలయ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తెగని సరిహద్దు వివాదం

- గతంలో సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించిన గొల్లపల్లి ప్రజలు
- సమస్య పరిష్కారం కాకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామంటున్న వెంకట్రావుపల్లె ప్రజలు



ఇల్లంతకుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల పునర్విభజనతో రెండు గ్రామాల్లో విభేదాలు పొడచూపాయి. సరిహద్దు విషయంలో ఇరుగ్రామాల మధ్య వివాదం ఏడు సంవత్సరాలు గడిచినా పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయానికి రావడంతో సరిహద్దు వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. గొల్లపల్లి, వెంకట్రావుపల్లె గ్రామాలు గతంలో 1600జనాభా, 930 ఓటర్లతో ఏకైక గ్రామపంచాయతీగా ఉండేది. ప్రభుత్వం కొత్తగా గ్రామపంచాయతీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో గొల్లపల్లి గ్రామ పంచాయతీని వెంకట్రావుపల్లె, గొల్లపల్లి గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశారు. అధికారుల నిర్ణయం వల్ల గొల్లపల్లి గ్రామంలోని ఓటర్లు, భూములను వెంకట్రావుపల్లె గ్రామంలో కలిపారు. దీనిని గొల్లపల్లి గ్రామస్థులు వ్యతిరేకించారు. ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతో రెండు గ్రామాల్లో తొలుత ఎన్నికల వాతావరణం నెలకొంది. తమకు జరిగిన నష్టంపై ఏకమైన గొల్లపల్లి గ్రామస్థులు నామినేషన్లు వేయకుండా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అధికారులు సర్దిచెప్పడానికి ప్రయత్నించి విఫలం అయ్యారు. దీనితో గొల్లపల్లి గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారి పరిపాలన కొనసాగింది. కొంతకాలానికి ప్రభుత్వం మరోసారి గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చింది. అధికారులు చాకచక్యంగా వ్యవహరించి కొంతమందితో నామినేషన్లు వేయించారు. తిరిగి ఏకమైన గ్రామస్థులు నామినేషన్లు వేసిన వారందరు ఉపసంహరించుకున్నారు. ఐదు సంవత్సరాల పాటు స్థానిక ప్రజాప్రతినిధులు లేకుండా కొనసాగింది. స్పందించిన అధికారులు సరిహద్దు వివాదాన్ని పరిష్కరిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌పై వెంకట్రావుపల్లె గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సమగ్ర సర్వే జరుపగా వెంకట్రావుపల్లె గ్రామస్థులు బహిష్కరించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల ఒత్తిడిల మేరకు రెండవసారి సర్వేలో పాల్గొన్నారు.



మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న వెంకట్రావుపల్లె గ్రామస్థులు

తమ గ్రామానికి చెందిన బస్టాండ్, పాలకేంద్రం, పోచమ్మ, పాఠశాలతో పాటు 30ఇళ్ళు, వ్యవసాయ భూములను గొల్లపల్లి గ్రామపంచాయతీలో కలిపారని పేర్కొంటున్నారు. సమస్య పరిష్కరించాలని విన్నవించినట్లు తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం అయితేనే ఎన్నికల్లో పాల్గొంటామని, లేనట్లయితే ఎన్నికల బహిష్కరిస్తామని పేర్కొంటున్నారు. గొల్లపల్లి గ్రామస్థులు మాత్రం ఎన్నికల్లో పాల్గొంటామంటున్నారు. సమస్యలు ఉన్నట్లయితే పరిష్కరించుకోవాలి తప్ప ఎన్నికలకు దూరంగా ఉండటం సరైన విధానం కాదని అధికారులు పేర్కొంటున్నారు.

సర్పంచ్ ఎన్నికలలో పాల్గొంటాం..

- ఒరుపుల రాములుయాదవ్, గొల్లపల్లి



రాబోవు సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలలో గ్రామస్థులం పాల్గొంటాం. గతంలో మా గ్రామానికి చెందిన ఓటర్లను వెంకట్రావుపల్లె గ్రామంలో కలపడం వల్ల ఎన్నికలను బహిష్కరించాం. అధికారులు ఎంత ఒత్తిడి చేసినా గ్రామస్థులందరం ఒకే మాటకు కట్టుబడి ఉన్నాం. గ్రామపంచాయతీకి పాలకవర్గం లేకపోవడం వల్ల అన్ని రంగాలలో వెనుకబడిపోయాం. ప్రత్యేకాధికారి ఉన్నప్పటికిని ప్రజలకు మేలు జరగలేదు. మా గ్రామానికి దక్కవలసిన ప్రాధాన్యం ప్రస్తుతం లభించింది.

సమస్యలు పరిష్కరిస్తేనే ఎన్నికల్లో పాల్గొంటాం

- అనగోని యాదగిరిగౌడ్, వెంకట్రావుపల్లె



అధికారులు రెండవసారి ఇచ్చిన సరిహద్దు నోటిఫికేషన్ ఏకపక్షంగా ఇచ్చారు. దీని ద్వారా వెంకట్రావుపల్లెకు చెందిన బస్టాండ్, పోచమ్మ ఆలయం, పాలకేంద్రంతో పాటు దసరా పండుగ రోజు జరుపుకునే జంబి ప్రాంతం కూడా పోతుంది. సమస్యలు పరిష్కరించాలని సమగ్ర సర్వేను బహిష్కరించాం. నాయకులు, అధికారుల హామీతో రెండవసారి సర్వేలో పాల్గొన్నాం. మా గ్రామానికి రావలసిన ప్రాంతాలు రాకపోతే ఎన్నికలకు బహిష్కరించడానికి ఏమాత్రం వెనుకడుగు వేయం.

ఇరుగ్రామాల మధ్య సమన్వయం కుదర్చాలి

- మంద సుశీల, గొల్లపల్లి మాజీ సర్పంచ్



అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోకుండా రెండు గ్రామాల ప్రజల మధ్య సమన్వయం కుదర్చాలి. ప్రస్తుత నిర్ణయం వెంకట్రావుపల్లె గ్రామస్థులకు ఇబ్బందిగా మారింది. ఉమ్మడి గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు అన్నదమ్ములుగా కలిసి ఉన్నాం. ఎమ్మెల్యే, జిల్లాస్థాయి అధికారులు ఇప్పటికైనా స్పందిస్తే బాగుంటుంది. ప్రజల మనోభావాలను ప్రతి ఒక్కరు గౌరవించాలి. సరిహద్దు సమస్య పరిష్కారం అయితే ఇరుగ్రామాల ప్రజలు సంతోషంగా ఉంటారు.

'కోట' మృతితో కలత చెందిన కళాకారులు

- ఉమ్మడి జిల్లాతో కోట శ్రీనివాస్‌కు అనుబంధం



కోట శ్రీనివాసరావు 75వ జన్మదినం సందర్భంగా కళాభారతిలో ఘన సన్మానం(ఫైల్)

కరీంనగర్ కల్చరల్/సిరిసిల్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాస్ మరణ వార్త ఉమ్మడిజిల్లాలోని ఆయన అభిమానులు, కళాకారులను కలిచివేసింది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కరీంనగర్‌లో మన సమైక్యత కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో కళాభారతిలో జూలై 11, 2018లో కోట శ్రీనివాస్ 75వ జన్మదిన వేడుకలను సంస్థ అధ్యక్షుడు రొడ్డ యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్థ వారి 'బాపూ చెప్పిన మాట' సాంఘిక నాటికను తిలకించిన ఆయన నటీనటులను అభినందించారు. కార్యక్రమానికి ఆయన సోదరుడు కోట శంకర్‌రావుతోపాటు నటుడు బాబూమోహన్ పాల్గొన్నారు. 2009శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారానికి వచ్చారు. వేములవాడ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, సిరిసిల్ల నియోజకవర్గంలో పోటీచేసిన డాక్టర్ చంద్రశేఖర్‌రావు గెలుపు కోసం రోడ్‌షోలు, ఎన్నికల సభల్లో పాల్గొని ప్రసంగించారు. ఆయన మృతిపై రొడ్డ యాదగిరి, కృపాదానం, విగోపాల్‌రావు, కనకం రమణయ్య, మాడిశెట్టి గోపాల్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ధర్మపురి క్షేత్రంలో ఘనంగా గోపాల కాలువలు

ధర్మపురి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని ధర్మపురి క్షేత్రంలోని నర్మదేశ్వర స్వామి గద్దె ఆధ్వర్యంలో గోపాల కాలువలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోదావరి నది నుంచి తీసుకు వచ్చిన జలాలతో నర్మదేశ్వర స్వామి ఆలయంలో వేదపండితులు ఒజ్జల వికాస్, విలాస్, గుడ్ల నరహరి, రమేష్, సురేష్, రాపాక లక్ష్మీకాంతం, కశొజ్జుల సుధాకర్, ఒజ్జలకృష్ణమూర్తి, దేవిప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి అన్నపూజ అనంతరం ఊరేగింపుగా గోదావరి నదికి బయలు దేరారు. దారి పొడవునా మహిళలు బిందెలతో నీరు తీసుకువచ్చి బ్రాహ్మణులపైపోసి వేడుకలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఒజ్జల వికాస్, విలాస్, గుడ్ల నరహరి, రాపాక లక్ష్మీకాంతం, ఒజ్జల దేవిప్రసాద్, కశొజ్జుల సుధాకర్, ఒజ్జల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో గోపాల కాలువలు నిర్వహిస్తున్న అర్చకులు

కక్షిదారుల వద్దకు న్యాయవ్యవస్థ

- పెండింగ్ కేసుల పరిష్కారానికి సమష్టి కృషి అవసరం
- హైకోర్టు జడ్జి జస్టిస్ కె లక్ష్మణ్



ఓదెల కోర్టు ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్

ఓదెల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : న్యాయవ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకం కలిగించే దిశగా ప్రజలు, కక్షిదారుల వద్దకు న్యాయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని హైకోర్టు జడ్జి, పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఓదెలలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆయన ప్రారంభించారు. ముందుగా ఇక్కడికి చేరుకున్న హైకోర్టు జడ్జిలు జస్టిస్ లక్ష్మణ్, ఎస్.వి. శ్రావణ్‌కుమార్, ఈ.వి.వేణుగోపాల్, పుల్ల కార్తీక్, శ్రీనివాసరావు లకు కలెక్టర్ కోయ శ్రీహర్ష, సీపీ అంబర్ కిషోర్ ఝా పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన కోర్టు ప్రారంభోత్సవ సభలో హైకోర్టు జడ్జి లక్ష్మణ్ మాట్లాడుతూ కక్షిదారుల వద్దకు సత్వర న్యాయం అందేందుకు అదనంగా సివిల్ కోర్టులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఇక్కడి జూనియర్ సివిల్ కోర్టు ఏర్పడడం ప్రజలకు, కక్షిదారులకు ప్రయోజనకరమన్నారు. దీంతో అన్ని వర్గాలకు న్యాయం అందే అవకాశాలు మెరుగుపడుతాయని, న్యాయవ్యవస్థలో రూల్ ఆఫ్ లా అందరికీ సమానంగా అమలు కావాలని తెలిపారు. హైకోర్టులో 2.36 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, సుప్రీంకోర్టులో 82 వేల కేసులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. కోర్టులు ప్రారంభించుకున్నంత మాత్రాన పెండింగ్ కేసులు పరిష్కారం కావని, జడ్జిలు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు సమిష్టిగా పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. న్యాయవ్యవస్థలో కూడా మార్పు అవసరమని 30 శాతం మహిళా న్యాయవాదులు ఉండాలన్నారు. జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, శ్రీశైలం తర్వాత చోళుల వంశానికి చెందిన ఓదెల మల్లికార్జున స్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని తెలిపారు. అలాంటి గ్రామంలో కోర్టును ప్రారంభించుకున్నామని, గురుతరమైన బాధ్యత జడ్జిలపై, న్యాయవాదులపై ఉందన్నారు. కక్షిదారులకు న్యాయం అందించేందుకు వృత్తి ధర్మాన్ని పాటించాలని, దీంతో సమాజంలో విలువలు పెరుగుతాయన్నారు. జిల్లా జడ్జి కుంచాల సునీత మాట్లాడుతూ, ప్రతి పౌరునికి న్యాయం ప్రాథమిక హక్కు అని, అందుబాటులో ఉండేందుకు కోర్టును ప్రారంభించామన్నారు. అలాగే కోర్టులో 1226 కేసులు పెండింగ్‌లో ఉంటే ఇందులో 419 సివిల్, 807 క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. ఇక్కడి కోర్టుకు కక్షిదారుడు రావడానికి అనుకూలమైన సౌకర్యాలు ఉన్నాయని, బస్సులు, రైళ్ల సౌకర్యం దగ్గరలో రోడ్ల సౌకర్యాలు న్నాయని, అందరికీ అనుకూలమైన కోర్టును ప్రారంభించుకొన్నామన్నారు. సుల్తానాబాద్ కోర్టులో కేసులు అధికంగా ఉండడం వల్ల ఓదెలలో కోర్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైకోర్టు జడ్జిలను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. మెజిస్ట్రేట్ ధీరజ్ కుమార్, డీసీపీ కరుణాకర్, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐలు దీ కొండ రమేష్, వెంకటేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతిరెడ్డి తోపాటు పలువురు పాల్గొన్నారు.

నాంపల్లి గుట్టను సందర్శించిన ఈవో రాధాబాయి

- కాంట్రాక్టర్ల తీరుపై ఆగ్రహం, అధిక ధరలపై ఆరా
- ఈవో గుట్టపైకి వస్తున్నట్లు ముందే సమాచారం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



నాంపల్లి గుట్టపైన కాళీయమర్ధనంలో కొబ్బరికాయలను పరిశీలిస్తున్న ఈవో రాధాబాయి

వేములవాడ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి గుట్టను ఈవో రాధాబాయి ఆదివారం సందర్శించారు. ఈనెల 11వ తేది శుక్రవారం 'లక్ష్మీనృసింహస్వామి భక్తుల నిలువు దోపిడి' పేరుతో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు నాంపల్లి గుట్టపైకి వచ్చిన ఈవో ముందుగా నాంపల్లి లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఈవోకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించారు. అనంతరం ఆలయ గోపురం వద్దగల పరిసరాలను పరిశీలించారు. సమీపంలో కనిపించిన చెత్తను తొలగించాలని సిబ్బందికి సూచించారు. గుట్టపైన, మధ్యభాగంలోని, కాళీయ మర్ధనంలోని టెంకాయల విక్రయదారులను ఎంత ధరకు విక్రయిస్తున్నారని అడిగారు. కాళీయమర్ధనంలో పాలు, నూనె, దీపాల ధరలను తెలుసుకున్నారు. టెంకాయలను ఎంత ధరకు కొనుగోలు చేస్తున్నారో భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులను ఇబ్బందులకు గురిచేయవద్దని, భక్తులతో కాంట్రాక్టర్‌లు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా మెదలాలని, భక్తులకు ఇబ్బందులు తలెత్తితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాంపల్లి గుట్టపైకి వచ్చే భక్తులకు కొబ్బరికాయలు, పాలు, నూనే, దీపాల ధరలు తెలిసేలా ధరలు, పరిమాణంతో సహ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌లు, సంబంధిత అధికారులను ఆదేశించారు.

విలువలతో కూడిన విద్య సోషలిజం ద్వారానే సాధ్యం



పీడీఎస్‌యూ సదస్సులో మాట్లాడుతున్న అఖిలభారత విద్యా పరిరక్షణ కమిటీ

భగత్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహ, విలువలతో కూడిన విద్య కేవలం సోషలిజం ద్వారానే సాధ్యమని అఖిలభారత విద్యా పరిరక్షణ కమిటీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ పట్నాయక్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణతరగతుల్లో ఆదివారం మాట్లాడారు. విద్యార్థులు, యువత సోషలిస్టు సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు అశాస్త్రీయ విద్యను అందిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వ మతోన్మాద ఫాసిస్టుచర్యలను ప్రగతిశీల శక్తులు ఐక్యఉద్యమాల ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్రమాజీ నాయకుడు కొత్తపల్లి రవి, మాజీ రాష్ట్రఅధ్యక్షుడు ఆవుల అశోక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటీ పృథ్వీ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనిల్ సాయిబోలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, నరేందర్, భాస్కర్, ఎర్ర అఖిల్ కుమార్, సహాయ కార్యదర్శులు సాయి, కర్క గణేష్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓదెల మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఓదెల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఓదెల మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి గణపతిపూజ, పుణ్యాహవాచనం, మంటప స్థాపన, వీరభద్ర ఆరాధన తోపాటు పలు పూజలు నిర్వహించారు. అలాగే భద్రకాళి ఆవాహన రాత్రి పది గంటల నుంచి ప్రారంభమై తెల్లవారుఝాము వరకు కొనసాగుతుంది. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. శివసత్తులు, జోగినిల నృత్యాలతో స్వామి వారికి బోనాలను సమర్పించారు. పెద్దపట్నం నిర్వహించిన అనంతరం సోమవారం తెల్లవారుఝామున అగ్నిగుండాల మహోత్సవాన్ని నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులకు ఎలాంటి ఆటంకాలు జరుగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఈ ఓ సదయ్య తెలిపారు.



స్వామివారిని అలంకరిస్తున్న అర్చకులు

నిరుపయోగంగా సింగరేణి క్రీడామైదానం

- డంప్‌యార్డ్‌గా మారుతున్న ఖని అంబేద్కర్ క్రీడాప్రాంగణం

కోల్‌సిటీటౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడామైదానం నిరుపయోగంగా మారింది. పిచ్చిమొక్కలు, గడ్డి, చెత్తాచెదారంతో డంప్‌యార్డ్‌ను తలపిస్తున్నది. దీంతో క్రీడాకారులకు, వాకర్స్‌కు ఉపయోగకరంగా లేకుండా పోయింది. మైదానం అధ్వానంగా మారండంతో స్థానికకార్మికులు, కార్మిక కుటుంబాలు, క్రీడాకారులు దూరంగాఉన్న మైదానాలకు వెళ్ళాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. సింగరేణిసంస్థ పవర్‌హౌస్ కాలనీలోని కార్మిక, కార్మికకుటుంబాల కోసం మూడు దశాబ్ధాల క్రితం ఏర్పాటుచేసిన ఈ మినీ క్రీడామైదానం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. పలుమార్లు విజ్ఞప్తుల మేరకు సింగరేణిసంస్థ ప్రహరీ ఏర్పాటు చేసి అభివృద్ధిచేసింది. డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ క్రీడామైదానంగా నామకరణం చేసింది. దీంతో కార్మికులు, కార్మిక కుటుంబాలు, క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడింది. అయితే కొన్నేళ్ళుగా క్రీడామైదానం నిరాదరణకు గురికావడంతో అధ్వానంగా మారింది. మైదానానికి ఉన్న మెయిన్‌గేటు పనిచేయడం లేదు. అలాగే శివాలయం వైపు ఉన్న గేటు కింద పూర్తిగా దెబ్బతింది.



ఖని పవర్‌హౌస్‌కాలనీలోని క్రీడామైదానం



క్రీడా మైదానం ముందు వేసిన చెత్తాచెదారం

బాడ్మింటన్ క్రీడాకారుల శిక్షణ

బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులు ఈ మైదానంలోనే శిక్షణ తీసుకునేవారు. ఇక్కడి క్రీడాకారులు జిల్లా,రాష్ట్ర,జాతీయస్థాయిలో బాల్ బాడ్మింటన్ క్రీడాకారులుగా రాణించారు. ఇప్పటికి బాడ్మింటన్ శిక్షణ తీసుకుంటున్నారు. మైదానంలో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి ఫ్లడ్‌లైట్లు, ఇతరసౌకర్యాలు కల్పిస్తే క్రీడాకారులుగా రాణించే అవకాశం ఉంటుందని క్రీడాకారులు పేర్కొంటున్నారు. వర్షంపడితే చెరువుగా మారుతుందని చెబుతున్నారు.

- **మెరుగైన సౌకర్యాలు కల్పించాలి**

పాలపాటి వినోద్, బాల్‌బాడ్మింటన్ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ



క్రీడా మైదానంలో ఎంతో మంది బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించారు. ప్రస్తుతం క్రీడాప్రాంగణం అధ్వానంగా ఉండంతో ఇబ్బందిపడాల్సి వస్తున్నది. ఫ్లడ్‌లైట్లు, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే రాత్రి వేళల్లో కూడా శిక్షణకు అనుగుణంగా ఉంటుంది. వర్షం పడితే చెరువుగా మారుతున్నది. క్రీడా మైదానంలో వాకింగ్ అనుకూలంగా ఉండేలా ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాలి

అయిత శ్రీనివాస్ ఎంఈవో, కొడిమ్యాల



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఈవో: ప్రైవేటు పాఠశాలలు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. స్కూల్ వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే వాహనాలను సీజ్ చేయిస్తాం.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలకు విద్యార్థులను తరలించడానికి ఎలాంటి వాహనాలను వినియోగించాలి?

ఎంఈవో: విద్యార్థులను తరలించడానికి ఫిట్‌నెస్ ఉన్న వాహనాలనే వినియోగించాలి. డ్రైవర్లకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలి.

ఆంధ్రజ్యోతి: విద్యా ప్రమాణాల పెంపునకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఈవో: పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించేలా ఆయా పాఠశాలల యాజమాన్యాలకు అవగాహన కల్పిస్తున్నాం.

-కొడిమ్యాల

పచ్చి రొట్టతో భూసారం పెంపు

● చీడపీడల నియంత్రణ ● అధిక దిగుబడి సాధించేందుకు అనుకూలం

వెల్గటూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడులే లక్ష్యంగా భూసారం పెంచడానికి రైతులు పచ్చిరొట్టను సాగు చేసి సేంద్రియ ఎరువుగా వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు పంట అధిక దిగుబడి రావాలని విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. దీనితో భూసారం దెబ్బ తినడమే కాకుండా ఆహార పంటలు కలుషితం అమవుతున్నాయి. క్రమంగా పంటలో సూక్ష్మ, స్థూల పోషకాలు లోపిస్తున్నాయి. చీడ పురుగుల ఉధృతి పెరగడంతో రైతుకు పెట్టుబడుల బారం పెరుగుతోంది. రైతులు జీలుగ, జనుము సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



సాగు చేసిన పచ్చిరొట్ట

● సేంద్రియ ఎరువుగా పచ్చి రొట్ట

పచ్చిరొట్ట సేంద్రియ ఎరువుతో పాటు నత్రజనిని అందిస్తుంది. పచ్చి రొట్ట ప్రధానంగా 16 రకాలు ఉండగా ఎక్కువగా రైతులు జీలుగ, జనుము, పెసర, పిల్లి పెసర వంటివి సాగు చేస్తున్నారు. ఇది స్థూల సేంద్రియ ఎరువుగా తయారవుతోంది. వీటిని మొగ్గ దశ వరకు పెంచి భూమిలో కలియ దున్నుతారు. ఈ మొక్కలు లెగ్యుం జాతికి చెందినవి. వీటి వేర్లలోని గుడిపెలు నత్రజనిని స్వీకరించి మళ్లీ సాగు చేసిన పంట మొక్కకు నత్రజనిని అందించేలా సహకరిస్తాయి. పచ్చి రొట్ట పైర్లు పూత దశకు రావడానికి 40 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. దీనిని మడిలో కలియ దున్నిన రెండు వారాల తర్వాత వరి నాట్లు వేస్తే పంట బాగుంటుంది.

● సాగు చేసే విధానం..

ప్రధానంగా వరి సాగు చేసే రైతులు పచ్చి రొట్టను సాగు చేసుకుంటారు. వరి నారుమడులకు ముందే పచ్చిరొట్టను సాగు చేసుకోవాలి. వరి పంట క్షేత్రంలో ముందుగా దుక్కి దున్ని విత్తనాలు చల్లుకోవాలి. జీలుగ విత్తనాలు ఎకరాకు 15 కిలోలు, జనుము 18 కిలోలు, పెసర 8 కిలోలు విత్తనాలను చల్లుకోవాలి. పూత దశకు వచ్చిన తరువాత మడిలో కలియ దున్నాలి. కలియ దున్నిన రెండు వారాల తరువాత వరి నాటు వేయాలి.

● ప్రయోజనాలు

-పచ్చిరొట్ట పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులను వృద్ధి చేసి నేలను సారవంతం చేస్తుంది.

-వరి పంటకు నత్రజనిని అందించి నాణ్యత పెరిగేలా చేస్తుంది.

-నేల భౌతిక స్థితిని మెరుగు పరిచి భూమిని గుల్లగా మారుస్తుంది.

-నేలలో నీరు ఇంకే గుణాన్ని పెంచి, నేల కోతకు గురి కాకుండా కాపాడుతుంది.

-పురుగులు, తెగుళ్ల బెడదను తగ్గించి సస్యరక్షణ ఖర్చును నియంత్రిస్తుంది.

-జీవ రసాయనిక చర్యలతో నేలసారం పెరుగుతుంది.

● భూసారం పెరుగుతుంది

- ఏవో సాయికిరణ్



పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతం అవుతుంది. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి తప్పనిసరిగా పచ్చిరొట్టను సాగు చేసుకోవాలి. పచ్చిరొట్ట సాగు చేసిన పంటలకు సేంద్రియ ఎరువులతో పాటు నత్రజని అందిస్తుంది. పంటలు అధిక దిగుబడులు వస్తాయి.

పక్కాగా హాజరు ..

(5వ పేజీ తరువాయి)

విమర్శలు ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టమొచ్చినపుడు పాఠశాలకు రావడం, సమ యం కాకముంతే ఇంటి ముఖం పట్టడం, మధ్యాహ్న సమయం తర్వాత పాఠశాలల్లో ఉండకుండా కొంతమంది తమ వ్యాపారాలు, చిట్టీలు, రియల్ ఎస్టేట్ దందాల్లో మునిగి తేలుతున్నారు. ప్రాథమిక పాఠశాలల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒకరిద్దరు ఉపాధ్యాయులు పనిచేసే చోట పనులకు వెళ్లినప్పటికీ అనుమతులు లేకుండా దుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలున్నాయి.

మొబైల్ యాప్‌లోనే

జిల్లాలోని మారుమూల మండలాల్లో విధులు నిర్వర్తించే చాలామంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని తెలుస్తోంది. ఇలాంటి వాటికి చెక్ పెటేందుకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు ఉపయోగ పడుతుంది. ఉపాధ్యాయులు తమ మొబైల్ ఫోన్‌లోనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఫొటో తీయాల్సి ఉంటుంది. ఈ హాజరు జిల్లా విద్యా శాఖ అధికారితో పాటు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి అనుసంధానం ఉంటుంది. దీంతో ఉపాధ్యాయుడు ఏ సమయానికి బడికి వస్తున్నాడు, ఎప్పుడు ఇంటిముఖం పడుతున్నారనే విషయాలు తెలియనున్నాయి.

స్వాగతిస్తున్నాం..

- తిరుక్కోవెల శ్యామ్‌సుందర్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఫేషియల్ రికగ్నిషన్ అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. మున్ముందు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనుంది. ఉపాధ్యాయులకు ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని స్వాగతిస్తున్నాం.

ప్రభుత్వం పునరాలోచన చేయాలి..

- బోయినిపల్లి ఆనంద రావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు



ఉపాధ్యాయులకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం అమలుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వినియోగించవద్దన్న మార్గదర్శకాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం ఏ విధంగా ఉపయోగించే అవకాశాలుంటాయి.

ఇంకా ఉత్తర్వులు రాలేదు..

- రాము, జిల్లా విద్యాధికారి



ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలి. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం పెరిగేలా విధులు నిర్వర్తించాలి. ఫేషియల్ రికగ్నిషన్ హాజరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఉత్తర్వులు రాలేదు. ఈ విషయమై విద్యాశాఖ చర్చిస్తోంది. త్వరగా అమలు చేసే అవకాశముంది.

నేడు సంకటహర చతుర్థి

మెట్‌పల్లిటౌన్, జూలై13 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నాట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దొమ్మటి ప్రవీణ్ తెలిపారు. అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చన, పంచామృత అభిషేకలు నిర్వహించనున్నాట్లు తెలిపారు. భక్తులు సంప్రదాయ పద్ధతి ప్రకారం లుంగీ, చీర ధరించి రావాలని ఆయన కోరారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

జగిత్యాల అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల భారతీయ జనతా పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావును ఆదివారం కలిసి సన్మానించారు. బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ బెజ్జారపు ప్రవీణ్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తి నుంచి అంచెలంచెలుగా ఎదిగి చట్టసభల్లో ఎమ్మెల్సీగా ప్రజా సమస్యలపై పోరాడిన వ్యక్తికి గుర్తింపు బీజేపీలో మాత్రమే సాధ్యమని అన్నారు. బిజెపిలో కష్టపడ్డ వారికి పదవులు వస్తాయనడానికి బండి సంజయ్ కుమార్, రామచంద్రరావు లాంటి వారే నిదర్శనమని అన్నారు. జాతీయభావం కలిగిన న్యాయవాదులందరినీ ఏకం చేసి రాజ్యాంగాన్ని అభాసుపాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ దుశ్చర్యలను ప్రతి గడప గడపకు చేరవేస్తామని ఆయన అన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీజేపీ విజయమే లక్ష్యంగా రామచందర్‌రావు నాయకత్వంలో పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు మర్రిపెల్లి సత్యమ్, అనుమల్ల హరికృష్ణ, జున్ను రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించాలి

కొడిమ్యాల, జూలై13(ఆంధ్రజ్యోతి) : ద్రవ రూప(నానో) ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ విశ్వ విద్యాలయం సలహా మండలి మాజీ సభ్యుడు వెల్మల రాంరెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను, ఉద్యాన, విశ్వ విద్యాలయాల శాస్త్రవేత్తలను కోరారు. ఆదివారం రాంరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఇఫ్‌కో, క్రిబ్‌కో తదితర కంపెనీలు 2023 నుంచి మార్కెట్‌లో ద్రవ రూప ఎరువులను విడుదల చేసినా వీటి వినియోగంపై రైతులకు వ్యవసాయ శాఖ, ఉద్యాన, వ్యవసాయ విశ్వ విద్యాలయాల శాస్త్రవేత్తలు అగాహన కల్పించడం లేదన్నారు. దీంతో తెలంగాణలోని రైతులు 45కిలోల గుళికలు నింపిన యూరియా బస్తాలపైనె ఆధారపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు ద్రవరూప ఎరువులైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా?

● మరమ్మతుకు నోచుకోని ఎస్సారెస్పీ డిస్ట్రిబ్యూటరీ కాలువలు



మరమ్మతుకు నోచుకోని కాలువ

పెగడపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కాలువలకు మరమ్మతులు చేపట్టక పెగడపల్లి మండలంలో సాగు నీరు చివరి ఆయకట్టుకు అందడం లేదు. పదిహేను సంవత్సరాల క్రితం డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సిమెంట్ లైనింగ్ చేయగా కొన్నేళ్ల పాటు నీటి సరఫరా సక్రమంగా జరిగి పంట పొలాలకు నీరందింది. అనంతరం కాలువల మరమ్మతు చేపట్టక తూముల షట్టర్లు ఊడిపోయి, డ్రాపులు కూలిపోయాయి. కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి ఆనవాళ్లు మారిపోయాయి. ఎస్సారెస్పీ ప్రధాన కాలువల నుంచి నీటి విడుదల జరిగిన సమయంలో చివరి ఆయకట్టుకు నీరందక పంటలు ఎండిపోయిన సందర్భాలు ఉన్నాయి.

ఉపాధిహామీ నిధుల ద్వారా కాలువల పూడికతీత పనులు చేపట్టినా మధ్యలోనే వదిలేస్తున్నారు. పెగడపల్లి మండలంలోని పోలీస్ స్టేషన్ పక్క నుంచి వెళ్లే డి-77 డిస్ట్రిబ్యూటరీ కాలువ దాదాపు కిలోమీటరు మేర కనీసం పూడికతీత కూడా చేపట్టలేదు. ఇప్పటికైనా కాలువలలో పిచ్చి మొక్కలు, పూడిక తొలగించి, తూములకు షట్టర్లు బిగించి చివరి ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

తల్లిదండ్రుల పోషణను విస్మరిస్తే చర్యలు

జగిత్యాల అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులైన కన్న తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని దానిని విస్మరిస్తే జైలుకు వెళ్లడం తప్పదని జగిత్యాల జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరిఅశోక్ కుమార్ హెచ్చరించారు. కన్న వారిపట్ల కర్కషంగా వ్యవహరిస్తే శిక్షార్హులేనని అన్నారు. అలాంటి వారికి జైలు శిక్ష, జరిమానా ఒక్కో సారి రెండు పడతాయని అన్నారు. ఆదివారం జగిత్యాల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, గొల్లపెల్లి, మల్యాల, ధర్మపురి, పెగడపెల్లి, సారంగాపూర్, జగిత్యాల పట్టణానికి చేందిన వృద్ధ తల్లి దండ్రుల నిరాదరణ కేసుల్లో కొడుకులకు, కోడళ్లకు కౌన్సెలింగ్ నిర్వహించి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరిఅశోక్ కుమార్ పరిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ పిల్లల బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి వెల్మల ప్రకాశ్ రావు, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, పి. హన్మంత రెడ్డి, ఎండి యాకూబ్, పూసాల అశోక్, జలజ, పద్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

'అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని వెల్లుల్ల గ్రామంలో ఆదివారం జై భీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఆదివారం రాజ్యాంగ పరిరక్షణ భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి రేవంత్ సర్కార్ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు, మాజీ ఎంపీపీ తొగిటి అంజయ్య, ఆకుల లింగారెడ్డి, కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గూడురు తిరుపతి పాల్గొన్నారు.

'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దేశానికే ఆదర్శం'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మపురి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అనేది దేశానికే ఆదర్శమని పలువురు బీసీ సామాజికవర్గ కాంగ్రెస్ నాయకులు అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ సామాజికవర్గ కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కుల గణన చాల పకడ్బందీగా చేయడం జరిగిందని, ఇది దేశానికే ఉత్తమ నమూనా అంటూ పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేసే విధంగా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాన్ని ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో ఈ నెల 17 న గురువారం ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో ధర్మపురి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీసీ సామాజికవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో ధర్మపురి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, బుగ్గారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేముల సుభాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, పెగడపల్లి, గొల్లపల్లి ఏఎంసీ చైర్మన్లు బుర్ర రాములుగౌడ్, భీమ సంతోష్, బుగ్గారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గౌతమ్ పాల్గొన్నారు.

'బీసీ ఉద్యమాన్ని హైజాక్ చేస్తున్న ఎమ్మెల్సీ కవిత'

కథలాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేస్తే ఎమ్మెల్సీ కవిత ప్రజలను తప్పుదోవ పట్టించి ఉద్యమాన్ని హైజాక్ చేసే ప్రయత్నం చేస్తుందని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన అన్యాయాలు, అక్రమాల గురించి ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్న తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీపై జాగృతి మూకలను ప్రేరేపించి గన్‌మెన్‌లపై దాడి చేయడం అప్రజాస్వామిక చర్యగా పేర్కొన్నారు. బీసీ వర్గాలకు ప్రభుత్వం న్యాయం చేస్తుంటే అగ్రవర్ణాలకు చెందిన కవితకు ఏమిటి సంబంధమని అన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ కార్యదర్శి మల్లారెడ్డి, కోశాధికారి సుధాకర్, ఉపాధ్యక్షుడు శంకర్ తదితరులు ఉన్నారు.

మృతుడికి నివాళి

ధర్మపురి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నాగారం గ్రామానికి చెందిన పసుల రాజన్న హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆయన మృతదేహానికి ఆదివారం నివాళులర్పించారు. అనంతరం మంత్రి స్వంత ఖర్చులతో హైదరాబాద్ నుంచి స్వస్థలం వరకు అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి రూ.10 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

వైభవంగా పోచమ్మ బోనాలు

జగిత్యాల క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీనగర్, అర్బన్ హౌజింగ్ కాలనీల్లో ఆదివారం పోచమ్మ తల్లి బోనాల జాతర కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని డీజే, డప్పు చప్పుల్లు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి రాధిక, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతలు వేడుకల్లో పాల్గొని పోచమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శ్రీలత, శివకేసరి బాబు, నాయకులు హరీష్, గంగారెడ్డి, రాజు, చంద్రయ్య, గంగాధర్, మధుసూదన్, శేఖర్‌గౌడ్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

●ధర్మపురి: ధర్మపురి పట్టణంలో పోచమ్మ బోనాలు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్సీ కాలనీ, దుర్గకాలనీ, తోట్లవాడ, కాశెట్టివాడ, ముదిరాజ్‌వాడలో బోనాలు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టు పోచమ్మ బోనాలతో ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కూడ పోచమ్మ, మారెమ్మ బోనాలు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

●రాయికల్: పట్టణంలో పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తిపై పెట్టుకుని పట్టణంలోని మార్కండేయ దేవాలయం నుంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పోచమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి, వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, యువజన సంఘం అధ్యక్షుడు సామల సతీష్, ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజీవ్, కోశాధికారి బొమ్మకంటి నవీన్, ఉపాధ్యక్షులు సింగని సతీష్, ఎలిగేటి సతీష్, కార్యదర్శులు అనుమల్ల చంద్రతేజ, గంట్యాల ప్రవీణ్, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు తాటిపాముల విశ్వనాథం, శ్రీరాముల సత్యనారాయణ పాల్గొన్నారు.



జగిత్యాల శ్రీనగర్ కాలనీలో వేడుకలు



ధర్మపురిలో బోనాలతో మహిళలు



చెప్యాలలో బోనాలతో ఊరేగింపు

●మల్లాపూర్: మండల కేంద్రంలోని దుర్గాదేవి ఆలయం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని భక్తులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని మహిళలు, భక్తులు భక్తి శ్రద్ధలతో కొత్త కుండలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మహిళలు బోనం నెత్తిన ఎత్తుకుని డప్పు చప్పుల మధ్య ఊరేగింపుగా ఆలయంకు చేరుకున్నారు. బోనాలతో భక్తులు ప్రదిక్షణాలు చేసి అమ్మ వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మ వారి పల్లకి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

●కొడిమ్యాల: మండలంలోని చెప్యాల గ్రామంలో ఆదివారం గ్రామస్తులు పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వివిధ కుల సంఘాల మహిళలు కుటుంబ సభ్యులతో, బంధువులతో ఇంటికొక్క బోనంతో గ్రామంలోని కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుండి నెత్తిన బోనాలను ఎత్తుకొని గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయానికి డప్పు చప్పుళ్ళతో ఊరేగింపుగా వెల్లారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని కోరుకుంటు పోచమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి, మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నటుడు కోట శ్రీనివాసరావుకు నివాళి

ఇబ్రహీంపట్నం, జూలై13(ఆంధ్రజ్యోతి): కోట శ్రీనివాసరావు తెలుగు సినీ పరిశ్రమలో విలక్షణ నటుడని సినీ నిర్మాత అంకతి భరత్ కుమార్ పేర్కొన్నారు. కోట శ్రీనివాసరావు మృతి పట్ల ఆదివారం మండలంలోని వేములకుర్తి గ్రామ కూడలిలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1975 లో ప్రాణం ఖరీదు సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన కోట శ్రీనివాసరావు సుమారు 750 చిత్రాలలో నటించారు. ప్రతి సినిమాలో తన విలక్షణమైన నటనతో ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారని, 2015లో పద్మశ్రీ పురస్కారం తోపాటు తొమ్మిది నంది అవార్డులు అందుకున్న నటుడు కోట శ్రీనివాసరావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సినీ ఆర్టిస్టులు రాధారపు ప్రభాకర్ ఆరె రమేష్ కారం ఇంద్రయ్య ఆరె సురేందర్ పుప్పాల రాజేష్ బుక్య కైలాష్ నాగేష్ బాష మల్లేష్ ప్రవీణ్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రాయికల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1996-1997 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం మండలంలోని మూటపెల్లిలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చాలా కాలం తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుర్నం రత్నాకర్, చౌట్‌పెల్లి మహేష్, మచ్చ శేఖర్, మండ రమేష్, రాచర్ల ఆంజనేయులు, చిలివేరి సురేష్, కడార్ల శ్రీనివాస్, సాంబారు శ్రీనివాస్, దేవరాజం, పడాల రమేష్, సింగిడి రమేష్, బెజ్జంకి హరికృష్ణ, నరేందర్, జగన్, పోచయ్య, తిరుపతి రెడ్డి, దొంతి మధు, బైరి శ్రీనివాస్, పూరెల్లి శ్రీనివాస్, యాచమనేని శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి ప్రతిపాదన

మెట్‌పల్లిటౌన్, జూలై13 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల నూతన భవన నిర్మాణంకు 3.90 కోట్ల ప్రతిపాదన అనుమతి పత్రాలను ప్రభుత్వానికి నివేదించినట్లు టీపీసీసీ కో-ఆర్డినేటర్ ఎండి అవేజ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని శిథిలావస్థకు గురైన పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో పాఠశాలకు నూతన భవనంను నిర్మించాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను, ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్ర మార్కను కలిసి సమస్యను విన్నవించినట్లు తెలిపారు.